క్లుప్తంగా

సాగరతీరంలో పుణ్యస్నానాలకు ఏర్పాట్లు



సాగర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లు

కొమ్మాది: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మరుసటి రోజు సముద్ర స్నానాలు చేసే భక్తుల కోసం సాగరతీరంలో ఏర్పాట్లు చేస్తున్నారు. సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, ఐటీ జంక్షన్ బీచ్ వద్దకు పుణ్యస్నానాలకు వచ్చే భక్తుల కోసం జీవీఎంసీ అధికారులు సౌకర్యాలు కల్పిస్తున్నారు. పై మూడు బీచ్ పాయింట్ల వద్ద ఎల్‌ఈడీ లైట్లు, దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేశారు. ఆరోజు అదనంగా లైఫ్ గార్డ్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

టెన్నిస్‌బాల్‌లో కస్తూర్బా విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గంగాకుమారి

భీమునిపట్నం: భీమిలి కస్తూర్బాగాంధీ విద్యాలయ విద్యార్థినులు రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యాలయంలో 8,9 తరగతుల విద్యార్థినులు తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కేజీబీవీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాకుమారి వారిని అభినందించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమన్నారు. మరిన్ని పోటీల్లో పాల్గొని, మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

వైద్య విద్యార్థులకు పట్టాల పంపిణీ

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో 123 మంది విద్యార్థులకు సోమవారం వైద్య పట్టాలు పంపిణీ చేశారు. కళాశాలలో జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో విద్యార్థులకు ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, హైదరాబాద్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. అత్యధిక మార్కులు సాధించిన 16 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందించారు. ఉత్తమ విద్యార్థిగా సీహెచ్ మౌనిక ఎంపికయ్యారు. డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, సీఈవో డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, అదనపు సూపరింటెండెంట్ ప్రతిమాదేవి, ఏవో శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 25 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

తగరపువలస: స్థానిక శ్రీబాసర డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 25 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీఆర్ ఎడ్యుకేషన్ అండ్ ఐటీ సొల్యూషన్ సహకారంతో నిర్వహించిన మెగా క్యాంపస్ ఇంటర్వ్యూలలో చోళ, డెక్కన్, పేటీఎం, సుజుకి, వరుణ్, యోకోహమ, శ్రీరామ్ చిట్స్ తదితర సంస్థలు పాల్గొన్నాయి. ఎంపికైన విద్యార్థులను శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్, ప్రిన్సిపాళ్లు చప్పా సురేష్, భాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏవో కేశవ తదితరులు అభినందించారు.

అనాథలకు ఆసరా



బాలల సంరక్షణ కేంద్రానికి సరకులు అందిస్తున్న ప్రశాంతి

తగరపువలస: రాష్ట్ర శిష్టకరణాల సంఘం మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి సోమవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. భీమిలి మండలం తాళ్లవలస లిటిల్ హగ్స్ భరోసా బాలల సంరక్షణ కేంద్రంతో పాటు మధురవాడ డీ పాల్ భవన్ అనాథల కేంద్రంలో నిత్యావసర సరకులు, మూడు పూటలా భోజనం బిస్కెట్లు, పాలు, పండ్లు అందించారు. నిర్వాహకులు ఆమెను సత్కరించారు.



గుడిలోవలో తవ్వకాల్లో బయటపడ్డ శివలింగం

చారిత్రక ఆనవాళ్లు..

చెక్కుచెదరని శివాలయాలు

శతాబ్దాల చరిత భీమిలి సొంతం. ఆధ్యాత్మిక సౌరభాలనూ వెదజల్లుతూ వెలసిన ఆలయాలెన్నో నాటి ఆనవాళ్లుగా దర్శనమిస్తాయి. వందల ఏళ్ల నాటి చరిత్రకు.. మహ్మదీయుల దండయాత్రకు పురాతన శివాలయాలెన్నో ఇక్కడ చెక్కుచెదరని సాక్ష్యాలుగా నిలిచాయి. శివకేశవుల మధ్య అభేదాన్ని సూచిస్తూ ఇక్కడ కొన్ని ఆలయాల్లో శివలింగంపై విష్ణునామాలు ఉండటం విశేషం. వారణాసిని తలపించే క్షేత్రం, శివలింగమే లేని ఆలయం.. ఇంకా మరెన్నో విశేషాలు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా .. - తగరపువలస

200 ఏళ్ల నాటి ఉత్తర రామలింగేశ్వరాలయం

భీమిలి మండలం తాటితూరుకు చెందిన చెంచల సూర్యప్రకాశరావు అనే వ్యక్తి 200 ఏళ్ల క్రితం సంతానం కోసం తపిస్తూ రాతితో నిర్మించిన ఉత్తర రామలింగేశ్వర ఆలయం ఇప్పటికీ అలాగే ఉంది. ఇక్కడి శివలింగంపై కూడా విష్ణునామాలు స్పష్టంగా దర్శనమిస్తున్నాయి. ఈ శివాలయం గోడలపై రాతితో చెక్కిన వివిధ దేవతావిగ్రహాలు అలాగే ఉన్నాయి. సంతానం కోసం, వారి బాగోగుల కోసం చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వస్తుంటారు.



తాటితూరులోని పురాతన ఉత్తర రామలింగేశ్వర ఆలయం

శివలింగం లేని ఆలయం



ఆనందపురం మండలం పాలవలసలో పూర్తిగా శిథిలమైన శివాలయం తుప్పలమాటున ఇప్పటికీ ఉంది. అప్పట్లో శ్రీవైష్ణవులు ఈ ఆలయంలో శివుడిని పూజించేవారట. మహాశివుని పేరుతో ఉన్న మాగాణి కాజేసిన కొందరు దౌర్జన్యకారులు శ్రీవైష్ణవులపై దాడులు చేయగా వారు శివలింగాన్ని పట్టుకుని ఇదే పంచాయతీలో ఉన్న గుడిలోవ కొండపైకి పారిపోయినట్టు ఇప్పటికీ కథలుగా చెబుతారు. ప్రస్తుతం ఈ శివాలయంలో శివలింగం లేదు. తరువాత కాలంలో పాలవలసకు చెందిన చాలామంది ఈ శివాలయాన్ని పునరుద్ధరణ చేయడానికి ముందుకు వచ్చినా వ్యక్తిగత నష్టాలు రావడంతో మానుకున్నారు.


కృష్ణదేవరాయల కాలం నాటి ఆలయం

- శివలింగంపై విష్ణునామాలు



పొడుగుపాలెంలో పురాతన శివాలయం

ఆనందపురం మండలం పొడుగుపాలెం పంచాయతీలో ఉన్న పురాతన శివాలయం శ్రీకృష్ణదేవరాయల కాలం నాటిదని చెబుతారు. స్వయంభూగా వెలిసినట్టు చెప్పబడే ఈ ఆలయం అప్పట్లో మహమ్మదీయుల దండయాత్రలో శిథిలమైన విగ్రహాలు ఇప్పటికీ మౌనంగా నిలిచాయి. వినాయకుడు, కుమారస్వామి, నంది, భృంగి, నాగసర్పాల విగ్రహాలు దాడుల్లో దెబ్బతిన్నాయి. ఇప్పటికీ ఈ ఆలయం చుట్టూ తిరిగే నాగుపాము ఎవరికీ హాని చేయకపోవడం విశేషం. ఇక్కడి నంది విగ్రహాన్ని తిప్పితే సుఖ ప్రసవం అవుతుందని ఉత్తరాంధ్రలో భక్తులు నమ్ముతారు. శివకేశవులకు భేదం లేదు. శివుని పూజిస్తే విష్ణువును పూజించినట్టే, శివుని ద్వేషిస్తే శ్రీహరిని ద్వేషించినట్టేనని ఇక్కడి శివలింగం రుజువు చేస్తుంది. ఇక్కడి శివలింగంపై విష్ణునామాలే అందుకు నిదర్శనం.



శివలింగంపై విష్ణునామాలు

ఎన్నో మహిమలు గల దేవుడు

మారుమూల ఉన్న పొడుగుపాలెం శివాలయానికి ఉత్తరాంధ్ర నుంచి ఎందరో భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా గర్భిణులు సుఖప్రసవం కావడానికి ఇక్కడ నందీశ్వరుని ఆశీర్వాదాలు తీసుకుంటారు.

– కొమ్మూరు అప్పలరాజు, పొడుగుపాలెం



శివకేశవుల పాదాలను తాకే పుట్టుధార



గుడిలోవలో శివలింగం కింద నుంచి ఆకాశగంగ

పాలవలస పంచాయతీలో నలువైపులా పచ్చని కొండల నడుమ ఎత్తయిన ప్రదేశంలో బృహదాచలం (గుడిలోవ) పేరుతో 200 ఏళ్లకు పూర్వమే ప్రముఖ శైవక్షేత్రం వెలసింది. పూర్వం ఈ ప్రాంతంలో దేవతలు సంచరించేవారని, మునులు తపస్సు చేసేవారని ప్రతీతి. ఇదే క్షేత్రంలో శివుడు రంగనాథునిగా, విష్ణువు నారాయణేశ్వరునిగా పూజలు అందుకుంటున్నారు. ఇక్కడి శివకేశవుల పాదాలను తాకుతూ నిత్యం పుట్టుధార ప్రవహిస్తుంది. ఈ ఆకాశగంగలో స్నానమాచరిస్తే మానసిక ప్రశాంతత కలిగి శారీరక బాధలు తొలగిపోతాయని నమ్మకం.

వారణాసిని తలపిస్తూ..



సంగివలసలోని పురాతన ఉమారామలింగేశ్వర ఆలయం

జీవీఎంసీ రెండోవార్డు సంగివలసలో గోస్తనీ నదికి అభిముఖంగా 300 ఏళ్ల క్రితం నిర్మించిన ఉమా రామలింగేశ్వర ఆలయానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. వారణాసిలో కాశీ నాథుని చెంత గంగానదికి అభిముఖంగా తేనెరంగులో నలుపలకలుగా ఉన్న శివలింగం ఉన్నట్టే అలాగే గోస్తనీనది వద్ద తేనెరంగులో నలుపలకల శివలింగం ఇక్కడా ఉంది.

రహదారి నిర్మించాలని గ్రామస్తుల ఆందోళన

- రోడ్డు మొత్తం బూడిద తేలిపోయిందని ఆగ్రహం
- ఇరువైపులా వాహనాల అడ్డగింత



ఇరువైపులా నిలిచిపోయిన వాహనాలు



సంగివలస-పాండ్రంగి రహదారిలో వాహనాలను అడ్డుకున్న స్థానికులు

తగరపువలస: రహదారి కోసం సంగివలసవాసులు రోడ్డెక్కారు. రెండోవార్డు సంగివలస జాతీయ రహదారి నుంచి పద్మనాభం మండలం పాండ్రంగి మీదుగా ఆనందపురం మండలం బోని రహదారిని నిర్మించాలని కోరుతూ సోమవారం నిరసన చేపట్టారు. సంగివలస వద్ద ఇరువైపులా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఆరు మాసాలుగా ఈ రహదారి మొత్తం బూడిద తేలిపోయిందని స్థానికులు ఆరోపించారు. పాండ్రంగిలోని గోస్తనీనది నుంచి జీవీఎంసీకి పైపులైన్ నిర్మాణం కోసం తవ్వేసిన రహదారిని కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడం వలన ఎక్కడికక్కడ గోతులు ఏర్పడ్డాయన్నారు. దీనికితోడు ఈ మార్గంలో ఇటుక బట్టీలకు నిత్యం భారీ వాహనాలు ఇటుకలు, మట్టి, కలప, బొగ్గు వంటివి రవాణా చేయ డం వలన మరింత లోతుగా గోతులు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ గోతుల నుంచి వెలువడే బూడిద కారణంగా రహదారికి ఇరువైపులా నివాసం ఉంటున్న వారు శ్వాసకోశ వ్యాధులతో సతమతమవుతున్నారన్నారు.

కోడ్ అనంతరం పనులకు హామీ

వాహనాలు నిలిచిపోవడంతో జీవీఎంసీ సిబ్బంది వచ్చి తాత్కాలికంగా వాటర్ ట్యాంకులతో నీటిని రహదారిపై వేశారు. ఎన్నికల కోడ్ అనంతరం రోడ్డు పునర్నిర్మాణ పనులు చేపడతామని, అప్పటి వరకు స్థానికులకు ఇబ్బంది కలగకుండా నీటితో రోడ్డు తడుపుతామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

పూర్వ ప్రాథమిక విద్య బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న పీవో శ్రీదేవి, ఎస్ఎస్ఏ ఏఎంవో లక్ష్మి

పద్మనాభం: పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఇస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణను అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని భీమునిపట్నం ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా ఏఎంవో జి.లక్ష్మి సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రాల్లో పీపీ-1, పీపీ-2 విద్యార్థులకు నేర్పాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక కస్తూర్బా విద్యాలయంలో జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను సోమవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేస్తున్న టీఎల్ఎంను పరిశీలించారు. ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో కేఆర్‌పీ కె.సన్యాసినాయుడు, డీఆర్‌పీలు ఎస్.పద్దరాజు, ఎ.ఆదిబాబు, ఎ.ఈశ్వరరావు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు సూచనలు

ఎస్ఎస్ఏ ఏఎంవో లక్ష్మి పదో తరగతిని సందర్శించి విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. పబ్లిక్ పరీక్షల సన్నద్ధత గురించి వివరించారు. పరీక్షలంటే భయం పడవద్దన్నారు. ఒత్తిడిని అధిగమిస్తే మంచి మార్కులు సాధించవచ్చని తెలియజేశారు.

మాతృ మరణాలు సంభవిస్తే చర్యలు



ఎంసీహెచ్ కమిటీ సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మద్దిలపాలెం: మాతా, శిశు మరణాలు సంభవిస్తే చర్యలు తప్పవని, వాటి నివారణకు క్షేత్రస్థాయిలో గర్భిణులను గుర్తించి తగు సూచనలివ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆదేశించారు. రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో జనవరిలో సంభవించిన ఒక మాతృ మరణంపై సోమవారం ఆయన డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాతా, శిశు సంక్షేమ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్డిపల్లిలో ఒక మాతృ మరణం జనవరిలో జరిగిందని, ఇకపై అవి జరగకూడదని హెచ్చరించారు. గర్భిణిగా ఉన్నప్పుడే హై రిస్క్ ప్రెగ్నెన్సీని గుర్తించి తగిన వైద్య సలహాలు అందించాలని కేజీహెచ్, వీజీహెచ్‌లో గల గైనకాలజిస్టులకు సూచించారు. గర్భిణికి సాధారణ ప్రసవం అయ్యేటట్లు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డాక్టర్ లూసీ, నోడల్ అధికారి డాక్టర్ ఉషాప్రసాద్, గైనకాలజిస్ట్, సూపరింటెండెంట్, డాక్టర్ హెచ్‌ఆర్కే దొర, డాక్టర్ షర్మిలాకుమారి, గైనకాలజిస్టులు డాక్టర్ శ్రీదేవి, బి.వర్థిక, జనరల్ మెడిసిన్ ఓపీ డాక్టర్ జి.వి.గణేష్, ఎనాస్తీసియాలజిస్ట్, నోడల్ అధికారి బి.నాగేశ్వరరావు, త్రినాథరావు, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్, 108 సేవలు, ఐ.మనోరమ, డీపీహెచ్ఎన్‌వో డాక్టర్ కె.స్వప్న, రేవిడి ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి, రెడ్డిపల్లి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధార్మిక ఆచరణ లేని పూజ నిరర్థకం

మధురవాడ: ఎంత గొప్పగా పూజలు చేసినా ధార్మికమైన ఆచరణ లేనప్పుడు అదంతా నిరర్థకమేనని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు వివరించారు. రావణుడి నడవడిక మనకి అదే నేర్పిస్తుందన్నారు. మధురవాడలో జరుగుతున్న రామాయణ ప్రవచనాల్లో భాగంగా సుందరకాండలో పలు ఘట్టాలను సోమవారం వివరించారు. సీతమ్మ హనుమకు దర్శనమిచ్చిన తరువాత సంఘటనలు తెలియజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పీఎం పాలెం: పీఎం పాలెం పరిధి మొగదారమ్మ 11కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతుల కారణంగా మంగళవారం పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈఈ అప్పలనాయుడు తెలిపారు. ఈ కారణంగా ఆ రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, సైబర్ వ్యాలీ లే అవుట్, సీసీ పోలీస్ రోడ్డు, రుద్రరాజు లే అవుట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

నియామక పత్రం అందజేత

పద్మనాభం: బీజేపీ మండల అధ్యక్షురాలు తమటపు నాగమణికి పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు సోమవారం నియామక పత్రం అందజేశారు. పద్మనాభం జంక్షన్‌లోని పార్టీ మండల కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవి కుమార్, మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ముమ్మర ప్రచారం



రాయపాలెం హైస్కూల్లో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసనాయుడు తరపున వివిధ సంఘాలకు చెందిన ఉపాధ్యాయులు సోమవారం ముమ్మరంగా ప్రచారం చేశారు. జీవీఎంసీ పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి గాదెను గెలిపించాలని అభ్యర్థించారు. ఉపాధ్యాయ ప్రగతి చీఫ్ ఎడిటర్ సత్యనారాయణ, ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏఎస్ నాయుడు, అధ్యక్షుడు ఎన్.ధనుంజయరావు, భీమిలి మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలేవి?



మాట్లాడుతున్న మాల మహానాడు వ్యవస్థాపకుడు గోపాలరావు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీకి చెందిన సర్వే నంబర్ 86లో ఎకరాకు పైగా గెడ్డ పోరంబోకును ఆక్రమించిన హార్మోని రియల్ ఎస్టేట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు భాగం గోపాలరావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. ఈ ఆక్రమణపై మూడు నెలల క్రితం భీమిలి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. సదరు సంస్థ యాజమాన్యం ఆక్రమిత స్థలంలో గోడ, పార్కు, రోడ్డు నిర్మాణం చేపట్టినా పట్టించుకోలేదన్నారు. ఈ నెల 16న తాటితూరు పంచాయతీ కార్యదర్శికి కూడా ఫిర్యాదు చేస్తే సర్వేయర్ అక్కడికి వెళ్లకుండానే ఆక్రమణ జరగలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రూ.2 కోట్ల విలువైన స్థలం కబ్జాకు గురైనా స్పందించని వీఆర్వో, సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు ప్రతినిధులు బోని సన్నిబాబు, మామిడి వెంకటశివ, సియ్యాద్రి రాంబాబు, కొట్యాడ ఈశ్వర వీరకుమార్, ఉప్పాడ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి

వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను



భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీనును సత్కరిస్తున్న జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దొడ్డి కిరణ్

గోపాలపట్నం: భీమిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దామని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) నాయకులకు సూచించారు. జీవీఎంసీ 89వ వార్డు నాయకుడు, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దొడ్డి కిరణ్ ఇంటి వద్ద భీమిలి నియోజకవర్గ పరిధిలోని వార్డు నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. స్థానికంగా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఆయన్ను కిరణ్ సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు ఆళ్ల పైడిరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు కిరణ్ రెడ్డి, పార్టీ ఆనందపురం మండల అధ్యక్షుడు బంక సత్యం, కార్యకర్తలు తులసి, గౌరి, తరినాథ్, దొడ్డి సాయి, మళ్ల నూకప్పారావు, గణేష్, లక్ష్మణరావు, మధువర్మ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



పార్వతి పరమేశ్వరులకు కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులు

పద్మనాభం: విలాస్కాన్‌పాలెంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతి పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పార్వతి పరమేశ్వరుల విగ్రహాలకు వేద మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణం నిర్వహించారు. వంద మంది దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

కొత్తమ్మ హుండీ ఆదాయం రూ.6.07 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న శ్రీహరి సేవాసమితి ప్రతినిధులు

తగరపువలస: సంగివలస కొత్తమ్మ (ముగ్గురు అమ్మవార్ల) ఆలయ హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రెండు నెలలకు సంబంధించి రూ.6,07,321 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. గతంతో పోలిస్తే రూ.లక్ష ఆదాయం అదనంగా వచ్చిందన్నారు. హుండీల లెక్కింపులో ప్రధాన అర్చకుడు నరసింహమూర్తి, అర్చకులు ఏడిద రామకృష్ణ శర్మ, నాగేశ్వరరావు, నగరానికి చెందిన శ్రీహరిసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. ఇన్‌స్పెక్టర్‌గా నగరానికి చెందిన ఈవో పి.ఎస్.ఎన్. మూర్తి వ్యవహరించారు.